
# కాలము - కాలుడు

## కాసుఖేల నరసింహారావు





ఆ రోజు యమలోకం గందరగోళంగా ఉంది. యముడు తన సింహాసనం మీద లేడు. బ్రహ్మ సమావేశపరచిన దిక్పాలకుల కూటమికి వెళ్లాడు. అతని వాహనమైన మహిషం కూడా వేరే పని లేనట్లు మేతను నెమరువేసుకుంటూ అన్యమనస్కంగా ఉంది. కింకరులకు స్వేచ్ఛ లభించినట్లుంది. మరీ ఈ మధ్య భూమ్మీద జనాభా పెరిగిపోయి వాళ్లకు క్షణం తీరిక దొరకడం లేదు. ఎప్పుడూ పనే. వాళ్లకు చిత్రగుప్తుడి మీద కోపంగా ఉంది. ఎంతోకాలంగా, మరికొందరు కింకరులను నియమించాలని వాళ్లు కోరుతూ ఉన్నారు. యముడితో ముఖాముఖి చెప్పుకోవడానికి ధైర్యం చాలక చిత్రగుప్తుడి మీద విరుచుకు పడ్డారు. కింకరుల్లో ఒకడు ధైర్యం తెచ్చుకొని, చిత్రగుప్తుడితో ఇలా అన్నాడు. "అయ్యా, మీరైనా ప్రభువుగారికి చెప్పి కింకరుల సిబ్బందిని ఎక్కువ చేయండి. మీరేమో, వీడికి ఆయుస్సు మూడింది. వాడికి భూమ్మీద నూకలు చెల్లిపోయాయి, వెళ్లి వాడిని తరలించుకొని రండి అని పురమాయిస్తూ ఉంటారు. కాలం ఎంతగా మారిపోయింది? జబ్బులతో తీసుకుని చచ్చిపోయే వాళ్ల సంఖ్య మరింత తగ్గిపోయింది. ఆ కాలంలో ఫలానా మనిషి

దీర్ఘకాలంగా జబ్బున పడి ఉన్నాడు. వాడికి యమలోకయాత్ర కొద్దిదూరంలోనే ఉంది అన్న విషయాన్ని గ్రహించి మేము రాబందుల్లా కాచుకొని మీరు నిర్ణయించిన ఘడియ రాగానే వాణ్ణి బంధించి తెచ్చేశేవాళ్లం. ఇప్పుడు అలా కాదే బ్రహ్మకు రిమ్మ తెగులు అనే నానుడిని సార్థీకరిస్తూ, దేవతల మొరలేవి ఆలకించకుండా, మానవుడిని సృష్టించాడు. సూది దబ్బనమైనట్లు, వాడు తన మేధకు పదును పెట్టుకుంటూ ఎన్నెన్నో పరికరాలను సృష్టించాడు. వాటిల్లో రకరకాల వాహనాలున్నాయి. ఆ వావానాలతో , భూమినంతా ఆక్రమించుకున్నాడు. ఆకాశంలో విహరిస్తున్నాడు. విశ్వం యొక్క లోతుల్లోకి చొచ్చుకొస్తున్నాడు. ఇదంతా చాలదన్నట్లు, వాడి యంత్రాల పనితనాల్ని మరింతగా బాగు పరచి ఉన్నవాడికి, లేనివాడికి విచక్షణా రహితంగా ఆ వాహనాలను అందుబాటులోకి వచ్చేట్లు చేసేడు. ఇప్పటిమటుకు ఆ వాహన్నాల రద్దీ భూతలానికే పరిమితమై ఉంది. ఇప్పుడిప్పుడే ఆకాశంలో ఎక్కువ అవుతుంది. ఈ వాహోనాల ధర్మమా అని భూలోకాన్నంతటినీ తన గుప్పిట్లోకి తీసుకున్నాడు. నగరాలు పెరిగాయి. పల్లెలు, జానపదాలు మటుమాయమై పోతున్నాయి. అనేక పద్ధతుల ద్వారా, అవసరమున్నా లేకున్నా ప్రతి కుటుంబానికి ఒకటో, రెండో వాహనాలను సమకూర్చుకుంటున్నాడు. వాళ్ల మధ్య జరిగే బేరసారాలన్నిటినీ ఊళ్లో నడిబొడ్డున బజార్లు కట్టి అక్కడ కొనసాగిస్తున్నాడు. దాంతోటి, ఆ బజార్లలో ఎక్కడ చూసినా వాహనాలే. ఆ వాహనాలు, కాలం మూడినవాడినీ, ఒక్కొక్కసారి కాలం మూడనివాడినీ కూడ పొట్టన పెట్టుకుంటున్నాయి. దీంతోటి, మీ చిట్టాలో తప్పులు దొర్లుతున్నాయి. మా పని మరింతగా దుర్భరమై పోతూంది. మీ తప్పులూ, మాకుండవలసిన సంఖ్యాబలమూ లేకపోవడం.... వీటన్నిటితో మనం చేస్తున్న విధి నిర్వహణలో మునుపెన్నడు లేని తప్పులు దొర్లుతున్నాయి. మీరేమో, మీ రికార్డుల ప్రకారం ఫలానా వాడికి ఈ దినం ఈ సమయానికి ఆయుస్సు మూడింది. వాడిని మన లోకానికి తరలించమని ఆజ్ఞాపిస్తారు. పైగా, వాడి చిరునామా కూడా ఇస్తారాయె. అక్కడికెళ్లి విచారిస్తే, వాడు బజారు కెళ్లేడని చెప్తారు. ఎంత మనోవేగంతో బజారు చేరుకున్నా. అంతవరకు గుమిగూడి ఉన్న గుంపొకటి చెదిరిపోతూంటుంది. ఆరాలు తీస్తే, వాణ్ణి ఆసుపత్రికి తరలించేరన్న సంగతి తెలుస్తుంది. ఆసుపత్రికెళ్తే, అక్కడ ఇలాంటి కేసులు బోలెడు ఉంటాయి. అందరూ బ్యాండేజీల్లో దాక్కొని ఉంటారు. అందువల్ల ఒకడికి బదులు మరొకణ్ణి తీసుకొచ్చే ప్రమాదం ఉంది. పోనీలే, ఎవర్నో ఒకరిని తీసుకొచ్చేరులే అని మీరూరుకుంటారా? మీ చిట్టాను తిరగతోడి, మమ్మలను అనరాని మాటలు అంటూ మామీద విరుచుకుపడ్తారు. ఈ పరిస్థితుల్లో కింకరుల బలాన్ని పెంచకపోతే ఎలా? ఆయనకు ఆప్తులైనా, మీరు కూడా యమధర్మరాజులవారి దగ్గర భయంవల్లనో, భక్తివల్లనో నోరు విప్పరు. మా విధి నిర్వహణలో లోపం ఉందంటే, కొంతవరకైనా మీరు కూడా బాధ్యులే.

ఇంతెందుకు? మీ ఆజ్ఞమేరకు మాలో ఒకడు మద్రాసు వెళ్లేడా? అక్కడెక్కడో పేకాట ఆడ్తూన్న రావు అనేవాడిని లాక్కొని రమ్మన్నారా? వాడు వెళ్లి చాలా టైమైంది. ఇంకా రాలేదు. ఎవరినైనా పంపి వాకబు చేసి రమ్మందామంటే, ఇక్కడ నేనొక్కడినే ఉన్నాను. నేను కూడా వెళ్లిపోతే, మీకేదైనా అవసరం వస్తే, ఎలాగని ఉపేక్షిస్తున్నాను." అంటూ తన, తన సహచరుల విధి నిర్వహణలో ఉన్న ఆసక్తినీ, కష్టాలనూ ఏకరువు పెట్టేడు.

చిత్రగుప్తుడు ఒక చిరునవ్వు నవ్వి, ఆ కింకరుడితో ఇలాగన్నాడు. "నాయనా, నీ కష్టాలను అర్థం చేసుకోగలిగినవాడినే కానీ, తీర్చగలిగేది ఆ యమధర్మరాజే కదుటయ్యా? ఆయనేమో దక్షిణం దిశనంతా పర్యవేక్షించాలి కదా? పోనీ, ఆయన కష్టాలను అర్థం చేసుకుని, కుబేరుడికిచ్చినట్లు ఓ పుష్పక విమాన్నైనా ఇచ్చేరు కాదు. ఓ దున్నపోతునిచ్చి, దాంతోటి సరిపెట్టుకోమన్నారు. ఆయనకు, అప్పగించిన పని చాలా సులభమైన పని అనుకున్నాడేమో, ఆ బ్రహ్మదేవుడు. ఆయన మానవుడిని సృష్టించి అంతటితో ఊరుకున్నాడా?

వాడి మేధ దినదిన ప్రవర్ధమానమయ్యేట్లు చేసి, 'చూసేరా, నా సృష్టి కౌశల్యాన్ని?' అన్నట్లు ఆయనకున్న నాలుగు మీసాలూ మెలేసేడు. "ఏమిటయ్యా, నీ బోడిగొప్ప. ఆ మానవుడు ఎంతటి మేధావి అయినా, అనునిత్యం ప్రళయ నృత్యము చేసీ, నా పాదాల క్రిందపడి నలిగిపోవాల్సిందే కదా" అంటూ లయకారకుడైన శివుడు బ్రహ్మమీద విరుచుకుపడ్డాడు. బ్రహ్మ అన్నాడు "నేను కూడా ఊహించలేనంత విధంగా మానవుడు తన మేధను సానపెట్టి, మొదట చక్రాన్ని, ఆ తర్వాత ఆ చక్రాన్ని ఆధారం చేసుకుని, అనేక రకాల వాహనాలను నిర్మించి, భూమ్యాకాశాన్నంతా ఆక్రమించుకున్నాడు. రేపో, మాపో, సౌరమండలాన్నంతా తన ఆధీనంలోకి తెచ్చుకుని, విశ్వాంతరాళాల్లోకి రానున్నాడు. ఈ అవాంతరం ఇంతలో రాదనుకో. ఇప్పటిమటుకు, ఇంకా భూలోకాన్నే అంటిపెట్టుకుని ఉన్నాడు. కానీ, ఆ భూలోకంలో వాడు కట్టిన నగరాలు, భవంతులూ చూస్తే నాకే దిగ్భ్రమ కలుగుతూంటుంది. ఒక్కోసారి డబ్బు అనేదాన్ని సృష్టించి, తన ప్రపంచమంతా దాన్ని కేంద్రంగా చేసుకొని, తిరిగేటట్లు చేసుకున్నాడు. ఒక కేంద్రం, దానిచుట్టూ పరిభ్రమణ అనే విషయాన్ని ప్రాతిపదికగా నేను ఈ విశ్వాన్ని సృష్టించేను. 'చూశారా, అణువు మొదలు విశ్వంవరకూ ఒకే నమూనా' అని మళ్లీ నాలుగు మీసాలూ మెలేసేడు. ఆ మీసాలను మెలేస్తూ ఇంకా చెప్పుకొచ్చేడు "ఆఖరుకు నేను సృష్టించిన మానవుడు కూడా తాను సృష్టించిన డబ్బుకు కూడా ఈ నమూనాలే ప్రాతిపదిక చేసుకొని, 'ధనమూల మిదం జగత్' అన్న మూల సూత్రాన్ని తన జీవిత విధానానికి పునాది



చేసుకొన్నాడు". "ఆహా నీకింత పొగరా" అంటూ లయకారుడైన ఈశ్వరుడు, "ఓయీ, బ్రహ్మ విర్రవీగకు. నీవు సృష్టించిన ఈ విశ్వమంతా లయమైపోతూండాల్సిందే కదా" అని విష్ణువు వైపు ఒకసారి చూశాడు. ఆయనేమో, తనకే ప్రత్యేకమయిన నవ్వు నొకదానిని నవ్వి, తన చేతిలోని చక్రాన్ని, మానవుడి దృష్టిలో పడేటట్లుగా ఒకసారి త్రిప్పేడు. చక్రం భూమ్మీద అలాగ అవతరించింది.

తాండవ ప్రదర్శన చూపిస్తూనే బ్రహ్మ సృష్టిస్తూన్న వాటినంతా వెనువెంటనే లయమయ్యేట్లు చేయసాగేడు ఈశ్వరుడు. అప్పుడు విష్ణువు తన చక్రాన్ని ప్రయోగించి సృష్టింపబడ్డ ప్రతీది వెనువెంటనే తాండవించే శివ పాదాల క్రిందపడి నలిగిపోకుండా కొంతవరకూ తప్పించుకునేటట్లు చేసి, ప్రతిజీవికి కొంత ఆయుస్సు పోసి, ఆ స్థితికి తాను ఆధిపత్యం వహించేడు. అట్టి స్థితిలోనే ఒక్కక్షణం చక్ర దర్శనమైంది మానవుడికి. అలాగ మానవ ప్రగతికి విష్ణుచక్రం నాంది పలికింది. వాహనాలు, నగరాలు, భూమి మీద, ఆకాశంలో, నీటిగర్భంలో ఎక్కడపడితే అక్కడ ఏర్పడ్డాయి. మానవుడు ప్రాధమికంగా భూలోకవాసి కదా! అందుచేత, ఇప్పటి తనకున్న స్థితి కాలమానాన్ని, అంటే వయస్సును భూలోకంలోనే ఎక్కువగా గడుపుతున్నాడు. తానుగా సృష్టించుకొన్న డబ్బు అతని స్థితిగతులను నియమింప సాగింది. దానికోసం, అనునిత్యం వెంపర్లాటం, పోరాటం. విష్ణుప్రసాదమైన ఆయుష్కాలంలో ఈ డబ్బు వెంపర్లాటలో పోరాడి, పోరాడి ఆఖరకు శివుడి పాదాల క్రిందకు మెల్లిమెల్లిగా జారిపోతూ, నలిగిపోతూ తనకు భూమ్మీద మరిక ఉండవలసిన అవసరం లేదంటూ మనకొక పని ఉన్నట్లు సూచిస్తాడు. అది ఎప్పుడు, ఏ క్షణంలో జరుగుతుందో నేనొక చిట్టాలో రాసిపెట్టుకోవడం ప్రారంభించేను. ఆ సమయం రాగానే, మీలో ఒకడిని పురమాయించి, ఆ జీవిని ఈలోకానికి తరలించుక రమ్మంటాను. సృష్టించిన క్షణాన్ని బ్రహ్మ చెప్తాడు మన పాలకుడికి. విష్ణువుతో సంప్రదించి ఆ జీవి లయమయ్యే క్షణాన్ని శివుడు చెప్తాడు మన ధర్మరాజుకి. ఆయన నన్ను ఆజ్ఞాపిస్తాడు. వాళ్లు చెప్పిన పన్లు చేయడమే కానీ, మనం వాళ్లను నిలదీయలేం కదా!


కాకపోతే, అప్పుడప్పుడు ఈ మానవుడన్నవాడు మనకు తలనొప్పి కలిగిస్తూంటాడు. వాడి వాహనాలు, ఆ వాహనాల రద్దీ, నగరాలు, ఆ నగరాలు మన పంచభూతాలను హింసించే పద్ధతి. ఇవన్నీ మన కష్టాలను ఇనుమడింప చేయడం కాదూ! ఇవన్నీ ఎవరితో చెప్పుకుంటామయ్యా? మన కష్టాలను తీర్చబోతున్నామన్న భ్రమ కల్పించడానికి, బ్రహ్మ, శివుడు అప్పుడప్పుడు దిక్పాలకులను సమావేశ పరుస్తూంటారు. ఈసారి జరిగిన సమావేశంలోనైనా కింకరుల సంఖ్యను ఎక్కువ చేస్తారని ఆశిద్దాం.

"సరేలే! ఇదంతా ఎందుకుకానీ, నీవు మద్రాసు వెళ్లి ఆ పేకాటరాయుడిని తీసుకొని రమ్మన్న ఆ కింకరుడి గతి ఏమైందో చూడు. ఆ పేకాటగాడిని సరైన టైంకు ఇక్కడకు తరలించుకు వచ్చే బాధ్యత నీది. ఇంతలో ఎవరో ఒక కింకరుడు రాకమానడు. నా పని ఆగదులే. పో! మద్రాసుకు వెళ్లు" అంటూ కింకరుడికి చెప్పాల్సిన మాట మరొేటి లేనట్లు చిత్రగుప్తుడు తనపనిలో లీనమైపోయాడు.

కింకరుడు అవసరమైన వివరాలన్నిటినీ సేకరించుకొని, తన సహచరుడున్న ప్రదేశానికి చేరుకున్నాడు. ఆశ్చర్యం! తన సహాకింకరుడు ఆ రావు అనేవాడి వెనకాలే నిల్చొని, అతని పేకముక్కల మీద తన దృష్టినంతా సారించి చూస్తున్నాడు. వాడి వాలకం చూస్తుంటే తనెవరో, ఏ పనిమీద అక్కడకు వచ్చేడో... ఈ విషయాలన్నింటినీ మరచిపోయినట్లున్నాడు. పేకముక్కల వైపు మంత్రముగ్ధుడిలాగా చూస్తున్న వాడి వీపుమీద ఒక చరుపు చరిచేడు. (పాఠకులకొక గమనిక: యమకింకరులు ప్రాణాలతో ఉన్న మానవుడి ఇంద్రియాలకు అందరు. అందుచేత వాళ్ల ఉనికిని మానవుడు తెలుసుకోలేడు) ఆ చరుపుతో మొదట వచ్చిన కింకరుడు స్పృహలోకి వచ్చినట్లై రావు మెడకు ఉచ్చు బిగించి, అతడికి ఊపిరి సలపడం కష్టతరం చేశాడు. రావు బాధగా ఒక పెద్ద మూలుగు మూలిగి, వొళ్లు తెలియకుండా పడిపోయాడు.

క్లబ్బులో వాళ్లంతా, ఏమైంది, ఏమైంది అంటూ రావు చుట్టూ చేరి అతనికి ప్రధమ చికిత్స చేయసాగేరు. అంత హడావిడిలో కూడా ఎవ్వరూ వాళ్ల చేతుల్లో ఉన్న పేకముక్కల్ని, టేబుల్‌మీద ఉన్న కట్టలోని ముక్కల్ని వాళ్లు వాళ్లు క్రింద పడేసిన ముక్కల్ని వేరువేరుగానే ఉండేటట్లు చూసుకుంటూ, రావు చేతిలో ఉన్న ముక్కల్ని కూడా జాగ్రత్తగా టేబుల్ మీదనే ఉండేటట్లు ఏర్పాట్లు చేశారు. ఆటలో లేని నలుగు రైదుగురు చొరవ తీసుకుని రావును క్లబ్బుకు ఎదురుగా ఉన్న ఒక నర్సింగ్‌హోంలో చేర్పించేరు. మిగతావాళ్లంతా రావును మర్చిపోయినట్లే ఆట కొనసాగించేరు. కాకపోతే, అక్కడే తారట్లాడుతూన్న గిల్చర్డును పిలిచి రావు ఆట ఆడేటట్లుగా ఏర్పాటు చేసుకున్నారు. క్లబ్బులో స్నేహితులుండరు. అందరూ పరిచయస్థులే. ఒకరికొకరు అప్పులు ఇచ్చుకుంటారు. మిగతా విధాల కూడా సహాయం అందించుకుంటూ ఉంటారు. కానీ స్నేహితులు కారు. ఇంతకు చెప్పొచ్చేదేమంటే క్లబ్బు సభ్యత్వం స్నేహానికి పునాది కాదు. కథ మరోదారిన పడింది. అసలు మాట మరిచేం. రావు సంగతి ఏమైంది?

రావును నర్సింగ్‌హోంలో చేర్పించేరని చెప్పేం కదూ? మరో వారానికల్లా రావు క్లబ్బులో ప్రత్యక్షమయ్యాడు. అందరూ సానుభూతి చూపిస్తూ, ఆరోగ్యం ఎలాగుందని విచారించేరు. 'నా ఆరోగ్యానికేం కాని, ఆరోజు... అంటే నన్ను నర్సింగ్‌హోంలో చేర్చినరోజు నా గేం ఏమైంది?



నాకు బాగా జ్ఞాపకం. మూడో సీక్వెన్సు వస్తే ఆట అయినట్లే. చేతిలో మ్యారేజ్ ఉంది. అదీగాక, చేతిలో మరో ఆరు క్లెమ్స్ కూడా ఉన్నాయి. నా ఆట మరెవ్వరైనా ఆడేరా? డిక్ చేసేడా? అంటూ ఆట సంగతే మాట్లాడ్తున్నాడు రావు. "ఆ! డిక్ చేసేవయ్యా. సోలో! ఇదుగో ఆ ఆటలో నీవు గెల్చుకున్న 1200 రూ॥లు" అని అంటూ గిల్బర్టు ఆ డబ్బును రావుకిచ్చేడు.

రావు ఎగిరి గంతేస్తూ "వండర్‌ఫుల్! అక్కడా గెలుపే, ఇక్కడా గెలుపే" అంటూ జబ్బ చరిచేడు.


"అక్కడ గెలుపు అంటున్నావు! ఎక్కడ? ఏమిటి నీవు అనేది?" అంటూ నిలదీశారు అతని బృందం. వాళ్లందరినీ ఉద్దేశించి, "నాకొక విచిత్రమైన అనుభవం అయింది. మీలో చాలా మంది నేను చెప్పేది ఒక పుక్కిటి పురాణం అని కొట్టేస్తారు. కానీ నా అనుభవం మాత్రం నిజం. సావిత్రికథ మీలో చాలామందికి తెలిసే ఉంటుంది. నేనొక సావిత్రినై, యముడితో కాకపోయినా, యమకింకరులతోటి, చిత్రగుప్తుడితోటి దెబ్బలాడి మళ్లీ భూమ్మీద పడ్డాను. మీమధ్యకు వచ్చేను. అదుగో, చూశారా మీలో చాలామంది నన్నొక పిచ్చివాడిని చూసినట్లు చూస్తున్నారు. మీ ఆలోచన్లు మీవి. నా కత వినాలని ఆసక్తి ఉన్నవాళ్లు, నాతో కేంటిన్‌కి రండి. తినండి. త్రాగండి. ఖర్చునాది. వచ్చేవాళ్లు రండి" అంటూ కేంటీన్ వైపు నడవసాగేడు రావు. అందరూ వాళ్లలో వాళ్లు ముసిముసిగా నవ్వుకుంటూ, పేకాటలో మునిగిపోయారు. గిల్బర్టు మాత్రం, "ఇదిగో, రావూ నేనొస్తున్నాను. నాకు చెప్పు నీ కథ. ఏమైనా నాకు పార్టీ ఇవ్వాలి కదా! ఆనాటి ఆటను నేనేగా గెల్చింది. అఫ్‌కోర్సు అది నీ ఆటే. అందుకే ఆ డబ్బు నీకే ఇచ్చేసేను. పద. కేంటీనుకు" రావు, గిల్బర్టు కేంటీనుకెళ్లి కుర్చీలలో ఆసీనులయ్యారు.

"ఊ! చెప్పవయ్యా! అదెలాంటిదైనా, నీమీద ఉన్న అభిమానం వల్లనో, మంచి అభిప్రాయం వల్లనో, నమ్ముతాను. నమ్ముతానో, నమ్మనో నీకెందుకు? నాకు పార్టీ ఇవ్వాలి కదా? తింటూ, తాగుతూ నీకథ వింటాను. ఆర్డరియ్యి" అన్నాడు గిల్బర్టు. బేరర్‌ను పిల్చి ఆర్డరిచ్చేడు రావు.

కథ ప్రారంభించేడు రావు.

"మీరు నమ్మటం కాదు. మీరు నమ్మినా, నమ్మకపోయినా, నా అనుభవాన్ని నేను నమ్ముతాను. మిష్టర్ గిల్బర్ట్. ఆరోజు నేను చచ్చిపోయాననే అనుకున్నారు కదా మీరంతా. కానీ, నేను చచ్చిపోలేదయ్యా. నన్ను ఇద్దరు యమలోకానికి లాక్కెళ్లేరయ్యా. మీరెవరు అనడిగితే తాము యమకింకరులన్నారు. నీకు కాలం మూడింది. అందుకే నిన్ను యమలోకానికి తీసుకెళ్తున్నాం అన్నారు. నాకేమిటి కాలం మూడడమేమిటీ, ఎంత లేదన్నా మరో పదేండ్లు ఆయుస్సు ఉందని లెక్కలు కట్టి కంప్యూటర్ చెప్పిందయ్యా మొన్నీ మధ్యనే. కంప్యూటర్ మాట కాదనడానికి మీరెవరు, అని నిలదీశాను నేను. మీతో రానంటే రానని మొండికేశాను. వాళ్లతో పెనుగులాడేను. కంప్యూటర్ మాట నెత్తేసరికి వాళ్లకు కూడా నేను అంటున్న మాటల్లో కొంత సత్యం ఉందేమో అన్పించినట్లుంది. నన్ను వాళ్ల ఉచ్చులోంచి వదలకుండానే అదంతా మాకు తెలియదు. చెప్పుకోవాల్సింది ఏదైనా ఉంటే మా అధికారి చిత్రగుప్తుడితో చెప్పుకో" అంటూ నన్ను లాక్కెళ్లి చిత్రగుప్తుడి ముందర నిలబెట్టేరు.

యమలోకంలో ఎంత శుభ్రంగా ఉందనీ! ఏవేవో శబ్దాలు లీలగా విన్పిస్తున్నాయి. ఆ శబ్దాలు ఏమిటి అని అడిగేను. అవి పునర్జన్మ నెత్తని వాళ్ల ఆత్మఘోషలు అన్నారు వాళ్లు. చిత్రగుప్తుడు తనపనిలో నిమగ్నమై నావైపు చూడనైనా చూడలేదు. అప్పుడు ఆ కింకరులిద్దరూ, చిత్రగుప్తుడికి నన్ను తమ లోకానికి లాక్కొచ్చిన విషయం, నా అభ్యంతరాల ఉదంతమూ చెప్పేరు. నేను ఆయన్ని నిలదీసేను. నేను చేస్తున్న గోల భరించలేకననుకుంటా, గోలంటే నేను మృత్యువాత పడవలసిన ఘడియల్లో కాక ఆ తర్వాత ఎప్పుడో వీళ్లు నన్నిక్కడకు తేవడం అన్యాయం అని అరుస్తున్నాను. నా చావు ఎన్ని గంటలకని ఉందో నీ చిట్టా చూసి చెప్పవయ్యా అని ఆయన్ను కొంచెం కోపంగానే అడిగాను. ఏమిటయ్యా, నీ దబాయింపు. నీవు సరిగ్గా 9గం॥లకు చావాల్సి ఉంది. అప్పుడే మా కింకరులు నీ మీదకు వాళ్ల పాశాన్ని విసిరేరు. కాదంటావా? అన్నాడు చిత్రగుప్తుడు. "ఆపు, ఆపు" అంటూ గొంతెత్తి అరిచేను. అంతటి చిత్రగుప్తుడూ నివ్వెరపోయాడు. తమాయించుకొని, "ఏంటోయి రావూ, తెగ నీలుగుతున్నావు. నువ్వు తొమ్మిది గంటలకు, సరిగ్గా తొమ్మిది గంటలకు చచ్చేవు. ఒక్క నిమిషం కూడా అటూ ఇటూగా చచ్చేవు. మా లెక్కలనే తప్పుపట్టేంత వాడివా, నువ్వు" అనంటూ కింకరులవైపు తిరిగి "వీణ్ణి తీసుకెళ్లండి" అని ఆజ్ఞాపించేడు. నేను ప్రతిఘటించేను. కింకరులతో పెనుగులాడుతూనే, చిత్రగుప్తుడి కేసి చూస్తూ "తొమ్మిది గంటలన్నావు. ప్రొద్దున్నా, రాత్రా" అని యమలోకమంతా దద్దరిల్లేట్లు గర్జించేను. ఆ చిత్రగుప్తుడు కూడా ఎందుకో కాని, తాను తప్పు చేసినట్లుగా కన్పించేడు. అది అదనుగా తీసుకొని, 'చూడవయ్యా, నీ చిట్టాను మరొకసారి' అని చిత్రగుప్తుడిని ఆజ్ఞాపించినట్లుగా అన్నాను. చిట్టా తిరగేసి 'పొద్దున తొమ్మిది గంటలకు' అని జవాబిచ్చేడు. "ఆ! అక్కడే మీరందరూ పప్పులో కాలేసింది. మీ లోకంలో ప్రొద్దున, సాయంత్రం అంటూ కాలనిర్మితమైన సమయాలు లేకపోవచ్చు. భూమి మీద, అలా కాదే! కాలం అనేది ఒక్కో ప్రదేశానికి ఒక్కో రకంగా నిర్మితమై ఉంటుంది. మద్రాసులో ప్రొద్దున తొమ్మిది అంటే ప్రొద్దున్నే. అది సాయంత్రం/రాత్రి తొమ్మిది అవ్వడానికి వీలులేదు. మీవాళ్లు నన్ను తీసుకెళ్లడానికి, రాత్రి తొమ్మిద గంటలకు వచ్చేరు. అంటే, పన్నెండు గంటల తర్వాత. ప్రొద్దున తొమ్మిది గంటలకు నన్నిక్కడకు తీసుకొచ్చి ఉంటే, వాదించడానికి నాకు కేసులేదు. ఆరోజు ప్రొద్దున తొమ్మిదింటికి నాకు గండం ఉన్నట్లు కంప్యూటర్ చెప్పింది.



ఎందుకైనా మంచిదని ఆ టైంకు ఇంట్లోనే ఉన్నాను. ఏమంటే, మా భూమ్మీద వాహనాల రద్దీ జాస్తైందని నీకూ తెలుసు కదా! ఏ వాహనం క్రిందపడి చస్తానో అన్న భయంకొద్దీ బయుటకెళ్లలేదు. అయినా, కొద్దిగా నలతగా ఉన్నట్లు అన్పించింది. కొద్దిగా తలనొప్పిగా కూడా ఉంది. ఆనాడు సత్యవంతుడు తలభారంతోనే కదా చచ్చింది. అలా చచ్చినా, అంటే కాల నియమానికి, నిర్ణయానికి లోబడి చచ్చినా, సావిత్రి ధర్మమా అని మీ యముడిని ఒప్పించి ఆయనకు మళ్లీ ప్రాణదానం చేయించుకొని మొగుడిని తనతోపాటు భూలోకానికి తీసుకెళ్లింది. నువ్వు, మీ యమధర్మరాజు కంటే గొప్పవాడివా? తప్పు చేసేవు. నన్ను ఇక్కడకు తీసుకొని రాగలిగిన అధికారం లేదు నీకు. మరో అయిదు నిమిషాలకు అంటే ప్రొద్దున 9 గంటల తర్వాత అయిదు నిమిషాలకు తలనొప్పి మటుమాయమైంది. హాయిగా లేచి కూర్చున్నా. భోంచేసి, నిద్రపోయి రాత్రి క్లబ్బుకెళ్లేను. 9గం॥లకు మీవాడు వచ్చేడు. అప్పుడైనా వెంటనే నన్ను తీసుకుపోవడానికి ఆయత్తమైనాడా అంటే, అలా చేయకుండా నాచేతిలో ఉన్న పేకముక్కల వైపు మంత్రముగ్ధుడిలాగా ఒక ఐదు నిమిషాలు నిల్చొని ఉండిపోయాడు. ఇంతలో వాడిని వెతుక్కుంటూ మీ రెండో కింకరుడు వచ్చేడు. ఆ రెండవ కింకరుడు మొదట వచ్చినవాణ్ణి గదమాయించేవరకు మీ ప్రథమ కింకరుడు నామీదకు పాశం విసరలేదు. ఇదంతా నాకు తెలుస్తూనే ఉంది. ప్రొద్దున రావలసినవాడు రాత్రికి వచ్చినప్పుడే, ఏదో తప్పు జరిగిపోయిందనీ, నాకు కంప్యూటర్ చెప్పినట్లు మరో పదేండ్లు ఢోకా లేదనీ తెల్సుకున్నాను. పైపెచ్చు, ఏదో ఒక తొమ్మిది గంటలకు ఆ కింకరుడు పాశం విసిరి నాకు ఉచ్చు బిగించి ఉంటే, నీతో ఇంతగా వాదించడానికి ధైర్యం ఉండేది కాదేమో! ఏమంటే, భూమ్మీద ఎక్కడో ఒకచోట మద్రాసులో రాత్రి 9గంటలు అయ్యినప్పుడు, పగలు 9గం॥లు గానే ఉండడానికి అవకాశం ఉండనే ఉంది. పేకముక్కల ఆకర్షణలో పడిపోయి, ఆ ఘడియను కూడా అతిక్రమించేడా? మరి, నాకు మరో పదేండ్లు భూమ్మీద ఉండేట్లు రాసిపెట్టడం కాదా? నా జాతకాన్ని కంప్యూటర్‌లో చాలా వివరణతో విశ్లేషించాను. నన్ను ఇంత దూరం తెచ్చేక, మళ్లీ భూమ్మీదకు వదిలే ప్రసక్తే లేదని వాదించకండి. అది మొండి వాదన అవుతుంది. అలా మీరు చేస్తే, నేను యముడి దగ్గర ముందర ఈ విషయం ప్రస్తావించవలసి వస్తుంది. అప్పుడు మీ ఉద్యోగానికే ముప్పు వాటిల్ల వచ్చు. చట్టప్రకారం, భృత్యులు చేసిన తప్పుకు, అధికార్లు సంజాయిషీ ఇచ్చుకోవాలి కదా! ఇలాగా ఈ ధోరణిలో చిత్రగుప్తుడిని హడలకొట్టేను.

ఇంతలో, అక్కడకు యముడు వచ్చేడు. వస్తూనే, అలనాటి వేమూరి గగ్గయ్యలాగా గర్జించేడు. "ఏమయ్యా చిత్రగుప్తా, నువ్వు నీ విధులను సరిగ్గా నిర్వహిస్తున్నట్లు లేదు. మరికొంత మంది కింకరులను ఇవ్వమని అడిగి వుంటే, కాదంటానా? ప్రొద్దున తొమ్మిది గంటలకు తేవాల్సిన ప్రాణిని, రాత్రి 9 గంటలు దాటిపోయాక తెప్పిస్తావా?" అని నిలదీసేడు.

"తప్పైపోయింది, ప్రభూ. ఈసారికి మన్నించండి" అంటూ యమధర్మరాజు కాళ్లమీద పడిపోయాడు చిత్రగుప్తుడు. "సరేలే. నిన్ను క్షమించేను. మరోసారి ఇలాంటి తప్పు చేయకు" అని కింకరుల వైపు తిరిగి, "వీణ్ణి తీసుకెళ్లి భూలోకంలో వదిలివేసి రండి. అక్కడ వీడు చేయాల్సిన పన్లు చాలా ఉండిపోయాయి. అవన్నీ చేయడానికి భూలోక కాలమానం ప్రకారం మనిషి కుదుర్చుకున్న కాలమానం ప్రకారం మరో పదేండ్లు పడ్తుంది. అప్పుడు పట్టుకు రండి, వీడిని."

ఆ తర్వాత చిత్రగుప్తుడి వైపు తిరిగి "నీకు పని జాస్తి అయిన విషయాన్ని బ్రహ్మకు చెప్పేను. ఆ దేవాదిదేవుడు నీ పనిని సులభతరం చేయటానికి ఒక కంప్యూటర్‌ను ఇచ్చేడు. అది ఏ ప్రాణి వయస్సునూ మానవుడు నిర్మించుకున్న కాలమాన ప్రకారం నిర్ణయించదు. భూమ్మీద పడిన క్షణం నుంచి, మళ్లీ మాట్లాడితే మరికొంత కాలంలో ఒక ప్రాణి భూమ్మీద అవతరించపోతూందన్న అవకాశం ఏర్పడ్డ క్షణం నుంచీ, ఆ ప్రాణి యొక్క దైహిక వ్యాపారాలను అంచనా వేసి, దానికి భూమ్మీద నివసించే కాలాన్ని నిర్ణయిస్తుంది. అప్పుడు, ఈ రావులాంటి క్షుద్రులు నిన్ను నిలదీయలేరు. అంటే ఈ కంప్యూటర్ తప్పే చేయదు. నీవు చేయాల్సిన పని ఏమీ ఉండదు. ఆ కంప్యూటర్‌లో కొన్ని రోబోలు ఉన్నాయి. అవి అన్ని విషయాలను రికార్డు చేస్తాయి. అంటే చిట్టారాసే పనికూడా నీకుండదన్నమాట. కాకపోతే కింకరదళాన్ని ఎక్కువ చేయాలి. బ్రహ్మ, శివుడు ఇద్దరూ కూడా ఈ విషయంలో నాకు సహాయంగా ఉంటామన్నారు."

"అలా యముడు చిత్రగుప్తుడితో మాట్లాడుతూనే ఉన్నాడు. ఆసుపత్రిలో పడివున్న నాకు తెలివి వచ్చింది. రెండు మూడురోజుల్లో కోలుకున్నా. మళ్లీ మునుపటి బలం వచ్చేసింది. క్లబ్బుకు వచ్చేను. ఓయ్ గిల్బర్ట్ వచ్చీ రాగానే సువార్త అందించేవు."

బేరర్ మా ఆర్డరు ప్రకారం మేం ఏం కావాలన్నామో వాటన్నిటినీ తెచ్చిపెట్టేడు. అప్పుడు గిల్బర్టుకు ఒక ఆఫర్ చేసేను. ఆ రాత్రంతా క్లబ్బులోనే కాలక్షేపం చేద్దామని.

గిల్బర్టు నా ఆఫర్‌ను త్రోసి పుచ్చేడు. ఇంట్లో పెండ్లాం, పిల్లలు తనకోసం ఎదురు చూస్తూంటారని చెప్పి, మహా హడావుడిగా తినటం, త్రాగడం ముంగించేసి స్కూటరెక్కి గృహోన్ముఖుడై వెళ్లేడు.

మర్నాడు క్లబ్బుకు వెళ్లగానే తెలిసిన వార్త. ఆ ముందురోజు రాత్రి ఇంటికి వెళ్తూన్న గిల్బర్టు స్కూటర్‌ను నీళ్లలారీ ఒకటి ఢీకొని, గిల్బర్టు చనిపోయాడని. మళ్లీ గిల్బర్టు కన్పించలేదు. చిత్రగుప్తుడి చిట్టాలో ఈ విషయంగా తప్పు దొర్లలేదో, లేక యముడి తెచ్చిన రోబోలతో పనిచేస్తున్న కంప్యూటర్ పనిచేయడం మొదలెట్టిందో, ఈనాటికీ నాకు తెలియలేదు. ■

